అభినందనలు



రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను సన్మానిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర మహిళా ఇన్‌చార్జి, అఖిల భారత మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గా పనిచేసిన సీతక్క మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని అభిలాషించారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రానికి కుర్చీల విరాళం



అంగన్‌వాడి కేంద్రంలో కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

చింతల్: విజయ్‌నగర్ కాలనీకి చెందిన మోకా సూర్యనారాయణ, లావణ్య దంపతుల కుమారుడు మోకా నాగ వెంకట్ జ్ఞాపకార్థం ప్రతి నెల అనాథలకు అన్నదానం తదితర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం భగత్ సింగ్ నగర్‌లోని ఆరు అంగన్వాడీ కేంద్రాలు, దుర్గయ్య నగర్‌లోని అంగన్వాడి కేంద్రంలో చిన్నారులు కూర్చునేందుకు వీలుగా ఒక్కో కేంద్రానికి ఇరవై చొప్పున కుర్చీలను అందజేశారు. భగత్ సింగ్ నగర్‌లోని బస్తీ దవాఖానాలో గర్భిణిలకు ఐదు కుర్చీలను అందజేశారు.

రోడ్డుపైనే పడిగాపులు



సుచిత్రలో జాతీయ రహదారిపై నిల్చున్న ప్రయాణికులు

సుభాష్‌నగర్: నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే సుచిత్ర చౌరస్తాలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోడ్లను కలిపే సుచిత్రాలో అదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మేడ్చల్, సికింద్రాబాద్, అల్వాల్, మల్కాజ్గిరి, కూకట్పల్లి, షాపూర్, నగర్, గాజులరామారం ప్రాంతాలకు నిత్యం వంద సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బస్ షెల్టర్ లేకపోవడంతో వారు ఎండకు ఎండి వానకు తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


ఎన్నికల హామీలను అమలు చేస్తాం



కాంగ్రెస్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న జగదీశ్వర్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ప్రజలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని వివేకానంద నగర్, భాగ్యనగర్, కూకట్‌పల్లి బస్‌స్టాపుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే రెండు పథకాలు అమలు చేశారని, త్వరలోనే మిగిలిన పథకాలనే కాకుండా మరిన్ని పథకాలను ప్రవేశపెడతారన్నారు. పేదలకు అండా దండా కాంగ్రెస్ పార్టీ అని కొనియాడారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, నాయకులు కపిల్ రాజు, బసంత్ రాజు, సంగమేష్, గోపాల్, అరుణ దేవి, వెంకన్న, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరు చేయాలి



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న దొడ్ల రామకృష్ణగౌడ్

ఆల్విన్‌కాలనీ: కాలనీవాసులు తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటో కార్మికులకు అందజేయాలని దొడ్ల రామకృష్ణ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్ చౌరస్తాలో పేరుకుపోయిన చెత్తను తొలగింపచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో చెత్తా చెదారం వేయకుండా అవగాహన కల్పించే బాధ్యతను బస్తీ కమిటీ వారు తీసుకోవాలన్నారు. ఇళ్లతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాల భారిన పడకుండా ఉంటారని, చెత్తను వీధుల్లో, కాలువల్లో కాకుండా తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలకు అందజేయాలన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సహకారంతో ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆల్విన్‌కాలనీ డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, ఫారూఖ్, నాగరాజు, ఖలీమ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

హఫీజ్‌పేట్: నిరు పేద విద్యార్థులకు అశ్విని గ్రూప్ సంస్థ అండగా నిలిచింది. బుధవారం చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్‌లో సింగల్ పేరెంట్ కలిగిన నిరుపేద విద్యార్థులకు స్కూల్ ఫీజుల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సుమారు 30 మందికి పైగా తండ్రిలేని నిరుపేదల విద్యార్థుల ఫీజుల కోసం అశ్వినిగ్రూప్ సంస్థల చైర్మన్ అశ్విని సుబ్బారావు రూ.1.50 లక్షలను విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో దేశం గర్వించే వ్యక్తులుగా మెలగాలని వివరించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద హాజరై విద్యార్థులకు ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థి దశలోనే దేశ అభ్యున్నతి కోసం కృషి చేయాలన్నారు. అనంతరం అశ్విని సుబ్బారావు, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద, హనుమంతరావులను సన్మానించారు.

ఊడి పడిందా.. ప్రాణాలు గోవిందా..



జీడిమెట్ల బస్‌డిపో సమీపంలో..



చింతల్- షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ రోడ్డులో..

ప్రధాన రహదారులపై డివైడర్ల వెంబడి ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వివిధ పార్టీలకు, ప్రైవేట్ కార్యక్రమాలకు సంబంధించి నర్సాపూర్ రాష్ట్ర రహదారిలోని సూరారం కట్టమైసమ్మ మొదలు ఐడీపీఎల్ చౌరస్తా వరకు ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. కార్యక్రమాలు ముగిసిన వెంటనే వాటిని తొలగించాల్సిన జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో డివైడర్లలోని స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఊడి పడుతున్నాయి, కొన్ని చోట్ల వేలాడుతున్నాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే నర్సాపూర్ రహదారిపై వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయమై దృష్టి సారించి ఫ్లెక్సీలను ఎప్పటికప్పుడు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– రంగారెడ్డినగర్



షాపూర్‌నగర్ రహదారిలో..

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల రీ కండక్టరింగ్ పనులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11 కేవీ అపర్ణ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సెంట్రల్ పార్కు, ఏఎంఆర్ ఫంక్షన్ హాల్, వెంకటసాయి కాలనీ, మికాసా స్టెర్లింగ్, రాజధాని దాబా లైన్, అపర్ణ స్ప్లెండర్, దేవేందర్ కాలనీ, అదే విధంగా 11 కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కుమ్మరి బస్తీ, మున్సిపల్ కార్యాలయం, ఆంధ్రబస్తీ, సెంట్రల్ పార్క్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

జగద్గిరిగుట్ట: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ ఏఈ రాధాకిషన్ అన్నారు. 14న దేవమ్మ బస్తీ గణేష్ మండపం వద్ద , 15న రాజీవ్ గ్రహకల్ప, సంజయ్‌పురి కాలనీలలో కమ్యునిటీ హాల్ వద్ద బిల్లులు చెల్లించవచ్చని ఆయన వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుకు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాద పూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లగా సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని శివాలయం వద్ద నిజాంపేట్ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజా మహోత్సవానికి ఎమ్మెల్సీ హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



గురుమూర్తినగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎన్నికలకు ముందుకు మంజూరైన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ధ్యేయమన్నారు. కార్పొరేటర్ వెంట ఏఈ స్వాతి, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించండి



అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఐ నాయకులు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నేతలు అన్నారు. ఈ మేరకు బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ గాజులరామరంలోని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ సర్వే నెంబర్ 326, 307లో దేవేందర్ నగర్, మిథిలా నగర్, బాలయ్య బస్తి, రావినారాయణ రెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయన్నారు. సర్వే నెంబర్ 12 లో అప్పటి కలెక్టర్ ఎంవీ రెడ్డి హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారని, సదరు స్థలాన్ని కూడా అక్రమార్కులు కబ్జా చేశారన్నారు. జగద్గిరిగుట్ట సర్వే నెంబరు 348/1 లో దేవాదాయ భూమి, రాజీవ్ గృహకల్ప స్థలం, నిజాంపేట్ సర్వే నెంబర్లు 344, 87 లలో ప్రైవేట్ సర్వే నెంబర్ల పేరుతో కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఈ విషయమై స్పందించకపోతే ప్రజాభవన్‌లో జరిగే ప్రజాదర్బార్‌లో నేరుగా ముఖ్యమంత్రిని కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, బాచుపల్లి కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావు, మండల కోశాధికారి సదానంద, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, స్థానిక నాయకులు కె.మహేష్, కె.నాగేశ్వర్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

చింతల్: అభివృద్ధి పనుల విషయంలో వెనుకడుగు వేసేది లేదని, డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా మహ్మద్ రఫీ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని రోడామేస్త్రీనగర్-ఏలో రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రషీదా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని ప్రాంతాల్లో సమాంతరంగా అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ వెంట ఏఈ సంపత్, నాగరాజు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరేష్, హాఫిజ్, డివిజన్ సీనియర్ నాయకులు వహీద్ ఖురేషి, నిజాం, శ్రీకాంత్, రావుఫ్, ఖాజా, అఫ్సర్, ఇక్బాల్, ఫౌజియా, బాసీత్, సాజిద్, జిలాని, మక్బుల్, సాయి కిరణ్, యూనుస్, వహీద్ తదితరులు ఉన్నారు.

ధర్మపురి క్షేత్ర వార్షికోత్సవాలు ప్రారంభం



మియాపూర్: మియాపూర్‌లోని ధర్మపురి క్షేత్రంలో 37వ వార్షిక మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వార్షికోత్సవాలు 15వ తేదీ వరకు మూడ్రోజుల పాటు జరగనున్నాయన్నారు. తొలిరోజు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, ధ్వజారోహణం, అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వాహిని ప్రభాత, గురుకుల విద్యార్థుల బృందంచే నిర్వహించి వేదపఠనం, యోగాసనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సన్మానం



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల సెక్రటరీగా వ్యవహరిస్తున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తన విజయంలో విద్యార్థులు, అధ్యాపకుల పాత్ర ఎంతో ఉందని, మల్కాజ్‌గిరి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, డీన్ డాక్టర్ రాధికదేవి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రానికి విశేష స్పందన

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్‌లో బుధవారం నిర్వహించిన ఆధార్ నమోదు కేంద్రానికి విశేష స్పందన లభించింది. దాదాపు 65 మంది ఆధార్‌లో తప్పులు, చిరునామా మార్పు తదితర సమస్యలను పరిష్కరించుకున్నారు.

తాగునీటి పైప్‌లైన్లకు మరమ్మతులు

ఆల్విన్‌కాలనీ: అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు వృథాగా ఏరులై పారుతోందని, పైపులైన్ లీకేజీల కారణంగా కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని బుధవారం 'సాక్షి'లో కలుషితమవుతున్న తాగునీరు అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై కూకట్‌పల్లి జలమండలి అధికారులు స్పందించారు. కూకట్‌పల్లి, ప్రగతినగర్, ఆల్విన్‌కాలనీ, రిక్షాపుల్లర్స్ కాలనీ, రామకృష్ణ నగర్‌లలో పైపులైన్లను పరిశీలించి మరమ్మతులు చేశారు. ప్రగతినగర్‌లో పైపులైన్లకు మరమ్మతులు చేసి నూతన పైపులు ఏర్పాటు చేశారు. స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిని బెదిరించేందుకు..

చెరువులో దిగిన యువకుడి గల్లంతు

దుండిగల్: సెల్‌ఫోన్ విషయంలో తల్లిని బెదిరించే క్రమంలో ఓ యువకుడు చెరువులోకి దిగి నీటిలో గల్లంతైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. డీ పోచంపల్లికి చెందిన అంజయ్య యాదవ్, లక్ష్మి దంపతుల కుమారుడు సురేష్ యాదవ్(30) బుధవారం కొత్త సెల్‌ఫోన్ కొనుగోలు చేశాడు. అనంతరం ఇంటికి వెళ్లిన అతను కొత్త ఫోన్ కొన్నందుకు తనను ఏమీ అనొద్దని బెదిరించే ధోరణిలో మాట్లాడాడు. దీంతో లక్ష్మి ఏం చేసుకుంటావో చేసుకో అని చెప్పడంతో తల్లిని బెదిరించేందుకు కుడికుంట చెరువులో దిగిన అతను ఈత రాకపోవడంతో నీటిలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది చెరువులో గాలింపు చేపట్టారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వారం రోజులుగా ఇంతే...

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో గత వారం రోజులుగా పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగు నీరు వృథాగా పోతోంది. బస్టాప్ సమీపంలో ఉండడం వల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



లీకేజీ కారణంగా రోడ్డుపై పారుతున్న నీరు

అభివృద్ధి పనులే గెలిపించాయి



ఎమ్మెల్యే వివేకానందను సన్మానిస్తున్న సుభాష్‌నగర్ ప్రజలు..

జీడిమెట్ల: కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద చేపట్టిన అభివృద్ధి పనుల కారణంగానే ఆయన రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించారని సుభాష్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుభాష్‌నగర్‌లో ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిపై తనకు అవగాహన ఉందన్నారు. ప్రజలు తనపై నమ్మకంతోనే భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో గంపలబస్తీ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్, నదీమ్, రషీద్, ఇస్మాయిల్, రఫిక్‌ఘోష్, ఇషాక్, ఫహీం, సిరాజ్, కలీం, వసీం, షాబుద్దీన్, ఫర్దీన్, సాజిద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కుత్బుల్లాపూర్: గజీడిమెట్ల డివిజన్ బీరప్పనగర్‌లో బుధవారం శ్రీ కామరాతి సమేత బీరప్పస్వామి ఆలయంలో కవాడి చంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి గురుస్వామి, జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భిక్షను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష చేపట్టడం ఎంతో పుణ్యమని, స్వామి వారి కృపా కటాక్షాలు అందరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీను, పారినాయుడు, స్వాములు మురళీకృష్ణ, అన్నం నాయుడు,కృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

నిజాంపేట్: బాచుపల్లి భైరుని చెరువు శివాలయం వద్ద కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ కొలన్ నీలారెడ్డి, కార్పొరేటర్లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ నీలారెడ్డి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై వర్క్ షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు, ప్రొఫెసర్లు..

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లిలోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో బుధవారం ఫ్లోరిడా విశ్వవిద్యాలయం సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సైన్స్‌పై ఇండో యుఎస్ వర్క్‌షాప్ రెండో ఎడిషన్ నిర్వహించారు. మహీంద్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రఫుల్ల కలాపతపు, ప్రముఖ డాక్టర్ సర్తాజ్ సాహ్ని, ఫ్లోరిడా విశ్వవిద్యాలయం కార్యక్రమానికి సహ–అధ్యక్షులుగా వ్యవహరించారు. ప్రొఫెసర్ కనప్పన్ పళనియప్పన్, ప్రొఫెసర్ గుణసీతారామన్, ప్రొఫెసర్ దేవిక, ప్రొఫెసర్ ఎస్ఎస్ అయ్యంగార్, ప్రొఫెసర్ అరుణ్ కుమార్ పూజారి, ప్రొఫెసర్ సంగుతేవర్ రాజశేఖరన్, ప్రొఫెసర్ ఆరిఫ్ ఐ సర్వత్ వివిధ అంశాలపై ప్రసంగించారు. కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, మెషీన్ లెర్నింగ్, కంప్యూటర్ సైన్స్ తదితర రంగాలలో ఆలోచనల మార్పిడిని పెంపొందించడం ద్వారా ప్రఖ్యాత అంతర్జాతీయ, జాతీయ స్పీకర్లు తమ అనుభవాలను పంచుకోవడానికి ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా ఉపయోగపడిందన్నారు. ఈ వర్క్‌షాప్‌లో 300 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యాజులు మేదురి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ యువ పరిశోధకులు, విద్యార్థులు ప్రముఖ నిపుణులతో సంభాషించడానికి అవకాశం కల్పించిందన్నారు. ఈ ఎక్స్‌పోజర్ వారి పరిశోధన ప్రయత్నాలను కొనసాగించడానికి, అర్థవంతమైన పురోగతికి దోహదం చేస్తుందన్నారు.